# నంద్యాల నియోజకవర్గం పేద,మధ్య తరగతి ప్రజల సేవ కోసం గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో మూడు మార్కెట్ యార్డు దుకాణాలు

**సేవాకార్యక్రమాలు మరింత విస్తరించే దిశగా మార్కెట్ యార్డు దుకాణాలను పాడిన: గోళ్ళ రాజేష్ సేవా సంస్థలు**





**నంద్యాల,జూన్09.అక్షర టైమ్స్:-** స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు సంబంధించిన మంగళవారం నిర్వహించిన దుకాణాల బహిరంగ వేలంలో ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త గోళ్ళ రాజేష్ మూడు దుకాణాలను దక్కించుకున్నారు.యార్డులో మొత్తం 10 షాపులకు వేలం నిర్వహించగా.. అందులో షాప్ నంబర్ 5, 6, మరియు 8లను గోళ్ళ రాజేష్ తరపున ప్రతినిధులు పాడుకున్నారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ ప్రతినిధి, ప్రముఖ సీనియర్ పాత్రికేయులు నూర్ బాషా మీడియాతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లుగా గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని నూర్ బాషా కొనియాడారు. ప్రస్తుతం మార్కెట్ యార్డు వేలంలో దక్కించుకున్న ఈ మూడు షాపులను కూడా వ్యాపార కోణంలో కాకుండా, ప్రజల సంక్షేమానికి, వారికి మరింత మెరుగైన సేవలు అందించేందుకే ఉపయోగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నంద్యాల ప్రజల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న గొల్ల రాజేష్‌కు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, తనకు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని నూర్ బాషా పేర్కొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

## గ్రామ సమస్యలపై సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేసిన సిపిఎం నాయకులు



**ఆదోని,జూన్09.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామం లో త్రాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, రహదారి మరమతులపై తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు గ్రామ సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు సరఫరా చేస్తున్న త్రాగునీటిని శుద్ధి చేసి అందించాలని కోరారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటి నాణ్యత పై గ్రామస్తుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అలాగే గ్రామంలోని డ్రైనేజీ కాలువలు పూడిక తో నిండిపోవడంతో మురుగనీరు సక్రమంగా ప్రవహించడం లేదని, దీంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ హైస్కూల్ రహదారి పూర్తిగా గుంతల మయంగా మారిందని విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు రాకపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డిమాండ్ చేశారు. గ్రామ సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధికారులు తర్వి తగతిని చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. అనంతరం డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రాన్ని సచివాలయం సిబ్బంది అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అయ్యన్న, లక్ష్మన్న,గర్జప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం సీఎం సహాయ నిధితో 38 కుటుంబాలకు ఊరట

**పేదల పాలిట వరంగా సీఎం సహాయ నిధి**

**38 మంది లబ్ధిదారులకు 13,76,000 రూచెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి**







**ఆదోని,జూన్09.అక్షర టైమ్స్:-** ఆదోని నియోజకవర్గం పేద ప్రజలకు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సీఎం సహాయ నిధి కింద అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 38 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.వైద్య ఖర్చుల భారం కారణంగా కుటుంబాలు అప్పుల పాలవకుండా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, సంక్షేమ పాలనను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందుకోవడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి మరియు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు



**వేంపల్లె,జూన్09.అక్షర టైమ్స్:-** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ జిల్లా శివశంకర్ రెడ్డిని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్.ఎండి. షబ్బీర్, టీడీపీ నాయకులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే)లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం తహసిల్దార్‌కు అభినందనలు తెలియజేసి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, ఎం. గంగాధర్, మహమ్మద్ అలీ (సేట్), ఇమ్రాన్, మంజు, నరసింహ, ఖాసీం వల్లి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**నీట్ పేపర్ లీకేజీ పై సమగ్రమైన విచారణ జరిపి నేరస్థులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి**

**ఎన్,టి,ఏ ను రద్దు చేయాలి**




**ఆళ్లగడ్డ,జూన్09.అక్షర టైమ్స్:-** ఎస్ఎఫ్ఐ, ఆళ్లగడ్డ మండల కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలి మధ్య నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అనంతరం ఎస్ఎఫ్ఐ మండల్ కార్యదర్శి లతీఫ్ మాట్లాడుతూ,మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్య వ్యాపారం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని దేశవ్యాప్తంగా అనేక మైనటువంటి ప్రముఖ పరీక్షలు సందర్భంగా పేపర్ లీకేజీ వ్యవహారం ప్రారంభిస్తుంది ఇప్పటికే దేశవ్యాప్తంగా గత 12 సంవత్సరాల కాలంలో 89 పరీక్ష పేపర్లు లీక్ కావడం జరిగింది 48 పరీక్షలు రీ ఎగ్జామ్స్ నిర్వహించడం జరిగింది.దేశవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినటువంటి నీట్ పరీక్ష 23 లక్షల మంది విద్యార్థులు రాస్తే చివరికి పరీక్ష లీకేజ్ అయిందని పరీక్ష రద్దు చేయడం జరిగింది, దీని కారణంగా దేశవ్యాప్తంగా 8 మంది విద్యార్థులు ఆహత్మకు పాల్పడడం జరిగింది, దానితోపాటు దేశంలో 23 లక్షల మంది విద్యార్థులు నష్టపోవడం జరిగింది. గతంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్, టి,ఏ)అనేకమార్లు పేపర్ లీక్ చేస్తున్నప్పటికీ దీని వెనకాల అనేకమంది కేంద్ర మంత్రులు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ఉన్నప్పటికీ దీనిపై సమగ్రమైన విచారణ జరపడం గాని లేదా చర్యలు తీసుకోవడంలో కానీ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫ్లవం కావడం జరిగింది . ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్ష లీకేజ్ పై సమగ్రమైన విచారణ చేసి దోషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.అదేవిధంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ వెంటనే రాజీనామా చేయాలి,భారతదేశ విద్య రంగా వ్యవస్థను కాపాడాలని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఆళ్లగడ్డ మండల్ కమిటీ డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా రాజ్యాంగం లో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర ప్రభుత్వం గుత్తాధిపత్యం చాలా ఇస్తూ విద్యావ్యవస్థను రోజురోజుకు తీవ్రంగా నష్టం చేస్తూ రాష్ట్రాల హక్కులు కాలు రాస్తుంది దీనికి ప్రత్యేక నిదర్శనం ఉమ్మడి జాబితాలో ఉండాల్సినటువంటి నీటి పరీక్షను రాష్ట్రానికి ఎటువంటి సంబంధం లేకుండా పూర్తిగా కేంద్రం నిర్వహిస్తుంది. ఈ విధంగా కాకుండా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంగా నీటి పరీక్ష నిర్వహించుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలి రాష్ట్రాల హక్కులు కాపాడాలని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఆళ్లగడ్డ మండల కమిటీ డిమాండ్ చేయడం జరిగింది . అదే విధంగా గతంలో సీబీఎస్ఈ పరీక్ష పేపర్ల పరిశీలన విషయంలో అనేక అవినీతి అక్రమాలు జరిగినప్పటికీ ఈ అంశంపై సమగ్రమైన దర్యాప్తు సీబీఐకు అప్పజెప్పడంలో కేంద్ర ప్రభుత్వం వెనుక వేస్తుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి అదే విధంగా దేశంలో ప్రముఖమైనటువంటి అనేక సెంట్రల్ యూనివర్సిటీలో చదువు చదువుతున్న వారు దేశంలో అనేక విభాగాల్లో ముందడుగులో ఉన్నారు అలాంటి సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించేటువంటి సి యు ఈ టి యూజీ టెస్టు పరీక్ష మూడు రోజులు ఉందన్న సమయంలో పరీక్ష రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన ఇవ్వడం జరిగింది . ఇది కేవలం సెంట్రల్ యూనివర్సిటీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి లాబింగ్ వ్యవహారాల నిర్వహించుకోవడం కోసం వారి అవినీతి అక్రమాలు జోబులు నింపుకోవడం కోసం సి యు టి యు యూజీ పరీక్షను రద్దు చేయడం జరిగింది వెంటనే సి యు ఈ టి యూజీ ఎంట్రన్స్ టెస్టు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఆళ్లగడ్డ మండల కమిటీ డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుభాష్, వలి, రాజేష్, అజయ్, దిలీప్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల పక్ష సమావేశానికి మద్దతు ప్రకటించిన వామపక్ష పార్టీలు







**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం - ప్రజా హక్కుల కోసం మనమందరం ఒకటిగా ముందుకు సాగుదాం: మాజీ ఎమ్మెల్యే సాయిప్రసా రెడ్డి**

**ఆదోని,జూన్09.అక్షర టైమ్స్:-** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితిపై చర్చించేందుకు మరియు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి ఆదోని పట్టణంలోని ద్వారక ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు వై సాయి ప్రసాద్ రెడ్డి పిలుపు మేరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు మరియు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వామపక్షి పార్టీ నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సరైన దృష్టి సారించడం లేదని అభిప్రాయపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం జవాబుదారీతనం ప్రదర్శించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వై. సాయి ప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ, గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల ఇంటి వద్దకే చేరాయని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అలాగే, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టేందుకు మరియు ప్రజా సమస్యలపై గళం విప్పేందుకు 12-06-2026 తేదీన ఆదోని నియోజకవర్గంలో భారీ ప్రజా ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ర్యాలీలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు మరియు ప్రజలందరూ పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ మధుసూదన్, చంద్రకాంత్ రెడ్డి, దేవా, సందీప్ రెడ్డి, పరిగల్ నారాయణ ప్రజాప్రతినిధులు, మాజీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ స్థాయి నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుపై నిరసన






**ఆదోని,జూన్09.అక్షర టైమ్స్:-** వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ పెంపుపై నిరసన కార్యక్రమం లో భాగంగా ఆదోని పట్టణం నందు తాళ్లతో ఆటోలు లాగడం అలాగే భీమా సర్కిల్ నందు కట్టెల పొయ్యితో నీళ్లు వేడి చేసే నిరసనలు తెలియజేయడమైనది. ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలి పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి! రాష్ట్ర జిల్లా వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఐ ( యామ్), సిపిఐ( యామ్ యాల్) న్యూ డెమోక్రసీ, ఐ ఎఫ్ టీ యు పట్టణ మండల కార్యదర్శులు కామ్రేడ్స్ టీ. వీరేష్, కల్లుబావి రాజు, మదురై బి. ఎల్లప్ప, డి. లక్ష్మన్న, లింగన్న, మల్లికార్జున, నాగరాజ్ కె రమేష్ కుమార్ నాయకత్వంలో ఆదోని పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్ నుండి భారీ ర్యాలీ నిర్వహించబడింది. రాష్ట్రంలో పరిపాలిస్తున్న తెలుగుదేశం జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు వరుసగా పెరుగుతూ ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీలో నిరసనకారులు ఆటోను తాళ్లతో లాగుతూ బీమా సర్కిల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు కే అజయ్ బాబు డి హెచ్ పి ఎస్ జిల్లా సమితి రైతు సంఘం ఆదోని నియోజకవర్గం కార్యదర్శి బసాపురం గోపాల్ సభ్యులు ఏ విజయ్ కుమార్ సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు ఈరన్న అధ్యక్షత వహించారు. మహిళా నాయకురాలు మణెమ్మ ప్రసాద్ వారు మాట్లాడుత ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్ ధర లీటరుకు సుమారు ?117కు పైగా, డీజిల్ ధర ?105కు పైగా ఉండగా, దేశీయ ఎల్ పి జి సిలిండర్ ధర ఇటీవల మరో ?29 పెరిగి ఢిల్లీలో ?942కు చేరుకుంది. ఇటీవల కాలంలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా లీటరుకు సుమారు 7.5-8 వరకు పెరిగినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. కార్ డిక్కో ం3 చిన్న స్థాయి హోటళ్ల నుండి స్టార్ హోటళ్ల వరకు, ఆటో డ్రైవర్లు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, మధ్యతరగతి మరియు పేద కుటుంబాలు వరకు అందరూ ఈ ధరల పెరుగుదల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ ధరల పెంపుతో హోటల్ రంగం కూడా తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ఇకనుండి పాత పద్ధతిలోనే ఇండ్లలో మరియు హోటల్స్ నందు కట్టెల పొయ్యిలనే వాడకం వచ్చే పరిస్థితులు ఉన్నాయని రాష్ట్రవ్యాప్తంగా హోటల్ వ్యాపారులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ, ప్రజల జీవన వ్యయాన్ని మరింత పెంచే ఇలాంటి విధానాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రధాన డిమాండ్లు: పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలి. డీజిల్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి. గృహ వినియోగ ఎల్ పి జి గ్యాస్ ధరలను తగ్గించాలి. హోటల్ రంగానికి ప్రత్యేక రాయితీలు కల్పించాలి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులైన ఏఐటీయూసీ మరియు సిఐటియు విద్యార్థి యువజన సంఘాలు నాయకులు ఓబి నాగరాజు వైటి భీమేష్ జి అంజిత్ గౌడ్ బి శ్రీకాంత్ తిప్పన్నా గోపాల్ నాగరాజు రామకృష్ణ సి. నరసింహులు యాన్.ఈరన్న పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా కూటమి సభ ఘనవిజయం

## 2029లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని తులసిరెడ్డి ఆశాభావం



**వేంపల్లె,జూన్09.అక్షర టైమ్స్:-** కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో సోమవారం ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఇండియా కూటమి సమావేశం ఘనవిజయం సాధించడం హర్షణీయమని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ ఇండియా కూటమికి చెందిన 25 రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటం, పార్లమెంట్‌లో ఐక్య గళం వినిపించడం, ప్రతి రెండు నెలలకు ఒకసారి ఇండియా కూటమి సమావేశాలు నిర్వహించడం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్థిక సమస్యలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలపై పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమిని ఓడించి, కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని తులసిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, చక్రాయపేట మండల అధ్యక్షుడు రామాంజనేయులురెడ్డి, వేముల మండల అధ్యక్షుడు వెంకటేశు, నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్‌రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య, వేమా రాజా తదితరులు పాల్గొన్నారు.

# 'వెన్నుపోటుకు రెండేళ్లు' బ్లాక్ బెలూన్లు ఫోటో గ్యాలరీతో నిరసన తెలిపిన వైసీపీ నేతలు

**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా హామీలు నెరవేర్చలేదు: వైసీపీ నేతలు**

**ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది: సద్దల సూర్యనారాయణ రెడ్డి**

**నాడు సొంత మామకు, నేడు ప్రజలకు వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు అలవాటే: వైకాపా విమర్శలు**

**రాష్ట్రంలో యూరియా, ఎరువులు దొరక్క రైతులు అల్లాడుతున్నారు: వైసీపీ నేతల ఆవేదన**

**వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఆర్బీకేల ద్వారా రైతులకు అన్ని సౌకర్యాలు అందాయి**



**నంద్యాల,జూన్09.అక్షర టైమ్స్:-** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నంద్యాలలో వైఎస్సార్సీపీ శ్రేణులు నిరసన బాట పట్టాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో, అసెంబ్లీ పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి సమక్షంలో పార్టీ నేతలు నల్ల బెలూన్లను గాల్లోకి ఎగురవేసి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని నేతలు పరిశీలించారు. ఈ నిరసన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని చంద్రబాబు నాయుడు నెరవేర్చలేదని మండిపడ్డారు. నాడు సొంత మామకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు.. నేడు ప్రజలకు, నిరుద్యోగులకు, మహిళలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో కనీసం యూరియా, ఎరువులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని, గిట్టుబాటు ధరలు లేక రైతులు నట్టేట మునిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల (RBK) ద్వారా రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులను, ప్రజలను ఆదుకోకపోతే ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీసెల్ సెక్రటరీ శంకర్నాయక్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృతరాజ్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివయ్య, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టీవి రమణ, వైసీపీ నేతల బొల్లెద్దుల రవికుమార్, నంద్యాల వైసీపీ సెక్రటరీలు శివనాగిరెడ్డి, దేవనగర్ బాష, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు కారురవికుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆక్సిజన్ సిలిండర్ లేకుండా ఈ రైలు ఎక్కలేరయ్యో.. ప్రపంచంలోనే అత్యంత సాహసోపేత ప్రయాణం ఎక్కడో తెలుసా..?



ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైలు మార్గంలో ప్రయాణించడం అంటే అది కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాదు, అదొక గొప్ప సాహసం. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో, మేఘాల మధ్య సాగే ఈ అద్భుత రైలు ప్రయాణం గురించి వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. టికెట్ ధర సామాన్యులకు అందుబాటులో ఉన్నా, ఈ ప్రయాణానికి గుండె ధైర్యం మాత్రం పుష్కలంగా ఉండాలండోయ్..! ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే లైన్‌గా పేరుగాంచిన క్వింగ్హై-టిబెట్ రైల్వే మార్గం అద్భుతాలకు నిలయం. దాదాపు 1,956 కిలోమీటర్ల పొడవున్న ఈ రైలు మార్గం ప్రయాణికులకు సరికొత్త లోకాన్ని పరిచయం చేస్తుంది. ఈ ప్రయాణంలో రైలు సగటున 4,000 మీటర్ల (సుమారు 13,123 అడుగులు) ఎత్తులో పరుగులు తీస్తుంది. ప్రయాణంలో అత్యున్నత పాయింట్ అయిన 'టాంగులా పాస్' వద్ద రైలు ఏకంగా 5,072 మీటర్ల (16,640 అడుగుల) ఎత్తుకు చేరుకుంటుంది. ఆ సమయంలో మనం భూమిపై ఉన్నామా లేక ఆకాశంలో విహరిస్తున్నామా అన్నంత అనుభూతి కలుగుతుంది.

**ప్రాణవాయువు పడిపోయే ఎత్తులో అత్యాధునిక రక్షణ..**

సాధారణంగా ఇంత ఎత్తులో ఆక్సిజన్ స్థాయిలు భూమిపై కంటే 40 శాతం తక్కువగా ఉంటాయి. శ్వాస తీసుకోవడం చాలా కష్టతరంగా మారుతుంది. అందుకే ఈ రైలును ప్రత్యేకంగా రూపొందించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రైలులో రెండు రకాల ఆక్సిజన్ వ్యవస్థలు పనిచేస్తాయి. ఈ వ్యవస్థల ద్వారా రైలు లోపల ఆక్సిజన్ పరిమాణాన్ని బయటి వాతావరణం కంటే 23 శాతం అదనంగా పెంచుతారు. అయినప్పటికీ, రైలు గరిష్ట ఎత్తుకు చేరుకున్నప్పుడు ప్రయాణికుల సీట్ల పైన ఉండే ఆక్సిజన్ మాస్కులు వాటంతటవే కిందకు వస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు రైలులోనే ఆసుపత్రి తరహా ఏర్పాట్లు ఉంటాయి.

**కనువిందు చేసే ప్రకృతి దృశ్యాలు..**

ఆక్సిజన్ సమస్యలు ఉన్నప్పటికీ, కిటికీ గుండా కనిపించే ప్రకృతి దృశ్యాలు ప్రయాణికుల అలసటను మర్చిపోయేలా చేస్తాయి. బీజింగ్, షాంఘై వంటి నగరాల నుంచి ప్రారంభమై టిబెట్ మంచు కొండల గుండా ఈ రైలు సాగుతుంది. నీలిరంగు ఆకాశం కింద తెల్లటి మంచుతో కప్పబడిన పర్వతాలు, పచ్చని లోయలు ప్రయాణికులకు మరపురాని జ్ఞాపకాలను మిగిలిస్తాయి. ఈ అద్భుత దృశ్యాలను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు.

**సామాన్యులకు అందుబాటులో టికెట్ ధరలు..**

ఇంతటి సాహసోపేతమైన, విలాసవంతమైన ప్రయాణానికి లక్షల రూపాయలు ఖర్చవుతాయని అనుకుంటే పొరపాటే. ప్రయాణికుల సౌకర్యార్థం ఇందులో మూడు రకాల తరగతులు ఉన్నాయి:

హార్డ్ సీట్: ఇది అత్యంత చౌకైనది. దీని ధర కేవలం 212 రూపాయలు (360 యెన్లు) మాత్రమే.

హార్డ్ స్లీపర్: దీని టికెట్ ధర సుమారు 425 రూపాయలు (720 యెన్లు).

సాఫ్ట్ స్లీపర్: ఇది అత్యంత విలాసవంతమైనది. ప్రతి క్యాబిన్‌లో 4 బెర్త్‌లు, టీవీ స్క్రీన్, టేబుల్, ప్రతి ప్రయాణికుడికి ప్రత్యేక ఆక్సిజన్ అవుట్‌లెట్ ఉంటాయి. దీని ధర దాదాపు 675 రూపాయలు (1144 యెన్లు). 20 నుంచి 22 గంటల పాటు సాగే ఈ సుదీర్ఘ ప్రయాణం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అద్భుతమైన అనుభవంగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు.

# మీరు వాడిన దానికంటే ఎక్కువ కరెంట్ బిల్లు వస్తుందా ఒక్క కాల్‌తో సమస్యకు చెక్ పెట్టండిలా..




ఎండలు మండిపోతున్నాయి.. ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు ఫుల్ స్పీడ్‌లో తిరుగుతున్నాయి. అయితే గాలి చల్లగా ఉన్నా.. నెలాఖరున వచ్చే కరెంట్ బిల్లు మాత్రం చెమటలు పట్టిస్తోంది.. మీరు వాడిన దానికంటే ఎక్కువ బిల్లు వస్తోందా మీటర్ రీడింగ్‌లో తప్పులున్నాయని అనుమానంగా ఉందా ఆందోళన వద్దు.. ఒక్క కాల్‌తో మీ సమస్యకు ఎలా చెక్ పెట్టాలో తెలుసుకుందాం. భానుడి భగభగలు మొదలయ్యాయి. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం విపరీతంగా పెరిగింది. అయితే వీటి వాడకంతో పాటు నెలాఖరున వచ్చే విద్యుత్ బిల్లు కూడా సామాన్యుల జేబుకు చిల్లు పెడుతోంది. చాలా సందర్భాల్లో మనం వాడిన దానికంటే ఎక్కువ బిల్లు రావడం, రీడింగ్‌లో తప్పులు జరగడం చూస్తుంటాం. ఇలాంటప్పుడు ఆందోళన చెందకుండా, మీ హక్కులను ఎలా ఉపయోగించుకోవాలో, బిల్లును ఎలా తగ్గించుకోవాలో ఇప్పుడు చూద్దాం.

**అధిక బిల్లుకు కారణాలేంటి..?**

కేవలం వాడకం పెరగడమే కాకుండా ఇతర సాంకేతిక కారణాల వల్ల కూడా బిల్లు భారీగా రావచ్చు.

మీటర్ లోపాలు: విద్యుత్ మీటర్ మొరాయించడం లేదా వేగంగా తిరగడం.

రీడింగ్ తప్పులు: సిబ్బంది రీడింగ్ తీసేటప్పుడు అంకెలు తప్పుగా నమోదు చేయడం.

బకాయిలు: గత నెల కట్టిన బిల్లు అప్‌డేట్ కాకపోవడం వల్ల, ఆ మొత్తం ప్రస్తుత బిల్లులో కలిసి రావడం.

పరిష్కారం మీ చేతుల్లోనే: హెల్ప్‌లైన్ నంబర్ 1912

విద్యుత్ బిల్లులో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే మీరు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కేంద్రం దేశవ్యాప్తంగా 1912 అనే ఒకే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుండి 1912కు కాల్ చేసి, మీ కస్టమర్ ఐడి లేదా == నంబర్ చెబితే ప్రతినిధులు ఫిర్యాదు నమోదు చేసుకుంటారు. ఈ నంబర్ రోజులో 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

వాట్సాప్ ద్వారా సులభంగా..

కాల్ చేయడం ఇబ్బందిగా అనిపిస్తే, మీరు వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

మీ ఫోన్‌లో 8800001915 నంబర్‌ను సేవ్ చేసుకోండి.

అని మెసేజ్ పంపి, అక్కడ వచ్చే ఆప్షన్లలో మీ భాషను ఎంచుకుని ఫిర్యాదు నమోదు చేయండి.

ఫిర్యాదు చేశాక మీకు వచ్చే రిఫరెన్స్ నంబర్ ద్వారా మీ సమస్య ఏ దశలో ఉందో ట్రాక్ చేయవచ్చు. సాధారణంగా 3 నుండి 7 రోజుల్లో అధికారులు మీ ఇంటికి వచ్చి మీటర్ తనిఖీ చేస్తారు.

బిల్లు తగ్గించుకోవడానికి చిట్కాలు

ఫిర్యాదు చేయడంతో పాటు మనం కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బిల్లును నియంత్రించవచ్చు.

# టీడీపీ కార్యకర్తను పరామర్శించిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ యం.సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్,జూన్09.అక్షర టైమ్స్:-** బద్వేల్ పట్టణం 4వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వంకెల శ్రీనివాసులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు. శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సూర్యనారాయణ రెడ్డి , ఆయనకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన వైద్య సేవలు అందేలా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల సంక్షేమమే తమకు ముఖ్యమని, కష్టసుఖాల్లో కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. శ్రీనివాసులు పూర్తిగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్, పెట్రోల్,గ్యాస్ ధరలపై సీపీఐ నిరసన కార్యక్రమంనికి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు



**వేంపల్లె,జూన్09.అక్షర టైమ్స్:-** కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పార్టీ నాయకులు మంగళవారం వేంపల్లెలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో గ్యాస్ సిలిండర్ ఎత్తుకొని, ఆటోకు తాళ్లతో కట్టి లాగుతూ ధరల పెరుగుదలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా కో-కన్వీనర్ దాదా పీర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ, పెరుగుతున్న ఇంధన ధరలు సామాన్య ప్రజలపై భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ధరల నియంత్రణకు చర్యలు అవసరమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ మండల సభ్యులు ఎస్.ఎం.డి గౌస్, అల్లాబక్షు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా టిడిపి యువ నాయకుడు జయశంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వేంపల్లె,జూన్09.అక్షర టైమ్స్:-** టిడిపి యువ నాయకుడు సింగారెడ్డి జయశంకర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం వేంపల్లెలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి కుమారుడు జయశంకర్ రెడ్డి స్వగృహంలో అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న జయశంకర్ రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి చేస్తున్న కృషిని అభిమానులు కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజాసేవలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండూరు చైతన్య కుమార్, సింగారెడ్డి సాయి కృష్ణారెడ్డి, కమటం హరికుమార్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, నిరంజన్ రెడ్డి, రాముడు, లక్ష్మణ్, చంద్రాయుడు, శ్రీకాంత్, కిట్టూ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చెత్త డంప్ కోసం స్థలం కేటాయించాలి

## తహసీల్దారుకు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





**వేంపల్లె,జూన్09.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలో సేకరించే చెత్తను పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలో, కడప బైపాస్ రహదారి పక్కన వేయడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, చెత్త డంపింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త (ఇన్‌చార్జ్) ధ్రువకుమార్ రెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లె రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధృవకుమార్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో పాములూరు రహదారి సమీపంలోని గుట్టల ప్రాంతంలో చెత్త డంపింగ్ కోసం స్థల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పారిశుద్ధ్య సిబ్బంది పట్టణంలోని చెత్తను పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలో, కడప బైపాస్ రహదారి పక్కన వేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చెత్తను అక్కడ వేయకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి డంపింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాపాగ్ని నదిలో ఆక్రమణలు, అక్రమ బోర్లు, ఇసుక తవ్వకాల కారణంగా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, చక్రాయపేట మండల అధ్యక్షుడు రామాంజనేయులు రెడ్డి, వేముల మండల అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య, వేమ, రాజు తదితరులు పాల్గొన్నారు.